# కేబుల్ బ్రిడ్జిపై విషప్రచారాన్ని నమ్మొద్దు



కేబుల్ బ్రిడ్జిపై రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, మేయర్, బీఆర్ఎస్ నాయకులు

- అభివృద్ధిపై అక్కసు వెళ్లగక్కుతున్న ప్రతిపక్షాలు
- ప్రజలే ఆ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలి
- డైనమిక్ లైట్స్ ఏర్పాటు చేసే క్రేన్ వల్ల 50 మీట్లర మేర రోడ్డుకు ఇబ్బంది
- ఒక్క రోజులోనే మరమ్మతు చేయించాం
- వెయ్యి టన్నుల భారీ వాహనాలు కూడా పోతున్నాయి
- రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్
- మానేరు నదిపై కేబుల్ బ్రిడ్జి పరిశీలన

కార్పొరేషన్, అక్టోబర్ 28: కరీంనగర్‌లో ఎంతో అద్భుతంగా నిర్మించిన కేబుల్ బ్రిడ్జిపై విపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని, అసత్య ఆరోపణలను ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. మానేరు నదిపై నిర్మించిన కేబుల్ బ్రిడ్జిని శనివారం మంత్రి పరిశీలించారు. చిన్న సమస్యలను భూతద్దంలో చూపించి ప్రజల్ని భయభ్రాంత్రులకు గురి చేసే విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్న విపక్షాలపై మండిపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నగరంలో సాగుతున్న అభివృద్ధిని చూసి కళ్లు మండి తమ హాయాంలో ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టలేకపోయామన్న అక్కసుతోనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలోనూ కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ నాయకులు కేబుల్ బ్రిడ్జి కుంగిపోయిందంటూ ప్రజలను అయోమయానికి గురి చేసేందుకు ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. కానీ ఆ సమయంలో ప్రజలెవ్వరు కూడా ప్రతిపక్షాల మాటలు పట్టించుకోకుండా అప్పుడు నిర్వహించిన వీకెండ్ మస్తీ వేడుకలకు 20 వేలకుపైగా తరలివచ్చారని గుర్తు చేశారు. ప్రతి పక్షాలను ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఇంటర్నేషనల్ కంపెనీ అయినా టాటా కంపెనీ కేబుల్ బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించిందని పేర్కొన్నారు. ఈ బ్రిడ్జిపై బీటీ వేసిన తర్వాత ఏడాదికి చిన్న చిన్న సమస్యలు వస్తాయని కంపెనీ ప్రతినిధులు కూడా చెబుతున్నారని పేర్కొన్నారు. ఎక్కడైనా సీసీపై బీటీ వేయడం కింద తేమ ఉంటే అప్పుడప్పుడు ఉబ్బుతుందన్నారు. అలాగే ఈ కేబుల్ బ్రిడ్జిపై జరిగిందని, దీనిని టాటా కంపెనీ ప్రతినిధులు వాళ్లు వచ్చి పరిశీలించారని, పదేళ్ల వరకు వారే నిర్వహణ చేస్తున్నారని తెలిపారు. దీనికి తోడుగా డైనమిక్ లైట్స్ ఏర్పాటు చేసే క్రేన్‌ను కూడా తిప్పడం వల్ల 50 మీటర్ల మేర రోడ్డుకు ఇబ్బంది జరిగిందని, దానికి వెంటనే ఒక్క రోజులోనే మరమ్మతులు చేయించామని చెప్పారు. మరమ్మతులు పూర్తిగానే వేల టన్నుల బరువు ఉన్న భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం బ్రిడ్జి ఏదో ప్రమాదంలో ఉందని, నాణ్యత లేదని ప్రజల్ని అయోమయానికి గురి చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇన్ని అభివృద్ధి, అద్భుతమైన ప్రాజెక్టులు చేపడుతుంటే కడుపుమంటతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపిస్తున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి ఆగిపోవాలనే ఆలోచనతో ప్రతిపక్షాలు ఉన్నాయని విమర్శించారు. నగరంలో మానేరు రివర్ ఫ్రంట్ కట్టవద్దు.. దేవాలయం నిర్మించవద్దు.. ఇస్కాన్ టెంపుల్ కట్టవద్దు.. మెడికల్ కళాశాల నడవద్దు అన్న తీరులో ప్రతిపక్షాలు ఉన్నాయని ధ్వజమెత్తారు. ఆయా అభివృద్ధి పనులన్నీ ఆగిపోతే తాము రాజకీయ లబ్ధి పొందాలన్న ప్రయత్నమే వారిదని విమర్శించారు. ఎండ, వాన వచ్చినా ప్రభుత్వానిదే బాధ్యత అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గత 15 ఏండ్లుగా ప్రజలు ఓటు ద్వారా ఆయా పార్టీలను అధికారానికి దూరం చేసినా, వాటి తీరు మారలేదని మండిపడ్డారు. ఎన్నికలు రాగానే ప్రజల్ని అయోమయానికి గురి చేసే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టే ఏ అభివృద్ధి పనైనా నాణ్యతతో చేస్తామని స్పష్టం చేశారు. గుజరాత్‌లో బ్రిడ్జి కూలిపోయినట్లుగా ఇక్కడ కూలిపోయేది ఉండదన్నారు. టాటా కంపెనీ అద్భుతంగా పని చేస్తుందన్నారు. దేశానికే పేరు తీసుకువచ్చేలా మానేరు రివర్ ఫ్రంట్‌ను చేపడుతున్నామని చెప్పారు. అద్భుతమైన కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులను చూసి విపక్షాలు తట్టుకునే పరిస్థితి లేదన్నారు. ఈ బ్రిడ్జిపై భారీ లారీలు సైతం పోతున్నా కూడా ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. వీకెండ్ మస్తీ కార్యక్రమంపై కూడా విపక్షాలు తప్పుడు ప్రచారాలు చేశాయన్నారు. ప్రతిపక్షాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. విపక్షాల చేతికి పోతే ఇలాంటి అద్భుత ప్రాజెక్టులు ఉంటాయా? అని ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం కేబుల్ బ్రిడ్జిని చూసిపోయినా కాంగ్రెస్, సీపీఐ నాయకులు మరోసారి బ్రిడ్జిపైకి వచ్చి చూడాలని సూచించారు. కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు చిరకాలం నిలిచేలా నాణ్యత ప్రమాణాలతో ఉన్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు పాల్గొన్నారు.



మరమ్మతుల అనంతరం కేబుల్ బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న భారీ వాహనం



గడ్డం నాగరాజును ఆత్మీయ ఆలింగనం చేసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

# గులాబీ గూటికి గడ్డం నాగరాజు

- త్వరలో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు ప్రకటన
- స్వాగతం పలికిన ఎమ్మెల్యే రసమయి, జీవీఆర్

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 28 : మానకొండూర్ నియోజకవర్గంలో బీజేపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ మానకొండూర్ నియోజక ఇన్‌చార్జి గడ్డం నాగరాజు కమలాన్ని వీడి త్వరలో కారెక్కనున్నారు. గతంలో రెండు సార్లు మానకొండూర్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయనకు ఈసారి టికెట్ రాకపోవడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు. గత 32 ఏళ్లుగా పార్టీ పటిష్టత కోసం కష్టపడిన తనను కాదని కొత్తగా ఇటీవలే చేరిన వ్యక్తికి టికెట్ కేటాయించడంపై అసంతృప్తి చెందారు. భవిష్యత్ కార్యాచరణ కోసం గులాబీ గూటికి చేరాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే శనివారం మానకొండూర్ మండల కేంద్రంలో గడ్డం నాగరాజు ఇంటికి ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్‌తో పాటు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు స్వయంగా వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. తన ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే, జీవీఆర్‌ను నాగరాజు శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే, జీవీఆర్ మాట్లాడుతూ, నాగరాజు మానకొండూర్ నియోజకవర్గంలో చేసిన సేవలను గుర్తించి సముచిత స్థానం ఇస్తామని, ఆయన సేవలను పార్టీకి వినియోగించుకుంటామని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ, త్వరలో భారీ సంఖ్యలో తన అనుచరులతోపాటు బీజేపీ కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు తెలిపారు. కాగా, ఈ పరిణామంతో మానకొండూర్ నియోజకవర్గంలో బీజేపీకి కోలుకోలేని దెబ్బతగిలినట్లయింది. ఇక్కడ రాజన్న సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మానకొండూర్ జడ్పీటీసీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, సర్పంచులు రొడ్డ పృథ్వీరాజ్, దేవ సతీశ్ రెడ్డి, మానకొండూర్ బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు పిట్టల మధు, ఉప సర్పంచ్ నెల్లి మురళి, సీనియర్ నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నెల్లి శంకర్, శాతరాజు యాదగిరి, బీఆర్ఎస్వీ నియోజకవర్గ కన్వీనర్ గుర్రం కిరణ్ గౌడ్, నాయకులు సునీల్, అనిల్, కిరణ్, వెంకటస్వామి, కొట్టె రఘు ఉన్నారు.

# కాంగ్రెస్‌ను నమ్మితే తెలంగాణ అంధకారమే



కోట్ల నర్సింహులపల్లిలో ఎమ్మెల్యేకు మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న సర్పంచ్ కవిత, మహిళలు

- కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని కాపాడుకుందాం
- కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష
- బీఆర్ఎస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్
- గంగాధర మండలంలో ఎన్నికల ప్రచారం

గంగాధర, అక్టోబర్ 28: 'కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేస్తే నట్టేట ముంచుతారు. రైతుబంధు బంద్ చేస్తారు. కరెంటు ఇవ్వకుండా తెలంగాణ రాష్ట్రాన్ని అంధకారం చేస్తారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ కబంధహస్తాల్లో తెలంగాణ రాష్ట్రం చిక్కకుండా కాపాడుకుందాం' అని బీఆర్ఎస్ చొప్పదండి నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రజలను కోరారు. శనివారం గంగాధర మండలం కోట్ల నరసింహులపల్లి, సర్వారెడ్డిపల్లి, ముప్పిడినర్సయ్యపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కర్ణాటక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలను అమలు చేయకుండా చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు. రైతులకు ఐదు గంటలకంటే ఎక్కువ ఇవ్వలేమని స్వయంగా ఆ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి ప్రకటించడం అక్కడి పరిస్థితికి అద్దం పడుతున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని కర్ణాటక రాష్ట్ర రైతులు కొడంగల్, గద్వాల నియోజకవర్గాల్లో ప్రజలకు వివరిస్తూ నిరసన తెలుపుతున్నారని పేర్కొన్నారు. కన్నతల్లికి అన్నం పెట్టనోడు, పిన్న తల్లికి బంగారు గాజులు చేయిస్తానన్నట్లు కర్ణాటకలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేతులెత్తేసిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో 6 గ్యారంటీలను ఎలా అమలు చేస్తుందో వారికే తెలియదన్నారు. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. ఐదేళ్లలో చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, రెండో సారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీరామ్ మధుకర్, గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లోకిని ఎల్లయ్య, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్ రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, ఆత్మ చైర్మన్ తూం మల్లారెడ్డి, సర్పంచులు తోట కవితామల్లారెడ్డి, చిలుముల మంజులారమేశ్, పబ్బతి మల్లమ్మ, కంకణాల విజయేందర్ రెడ్డి, మడ్లపెల్లి గంగాధర్, నాయకులు ఆకుల మధుసూదన్, అట్ల శేఖర్ రెడ్డి, కరబూజ తిరుపతి, భాష మియా, పబ్బతి తిరుపతిరెడ్డి, రేగుల తిరుపతి, చిలుముల సుధాకర్, ఇరుకురాల రవి, గంగాధర సంపత్, పెంచాల చందు తదితరులు పాల్గొన్నారు.



దరువు ఎల్లన్నకు శాలువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, రాజన్న సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

# బీజేపీని నమ్మివస్తే.. నడిరోడ్డుపై వదిలేసింది

- ఉద్యమకారులను పూర్తిగా విస్మరించింది
- ప్రజా గాయకుడు దరువు ఎల్లన్న
- కషాయ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటన

ఇల్లంతకుంట, అక్టోబర్ 28: భారతీయ జనతా పార్టీ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించింది.. నమ్మివచ్చిన విద్యార్థి నాయకులను నడిరోడ్డుపై వదిలేసింది.. అని ప్రజా గాయకుడు దరువు ఎల్లన్న ఆరోపించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని వైశ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థి ఉద్యమ నాయకులకు చట్టసభల్లో అవకాశం కల్పిస్తామని చెప్పిన బీజేపీ, ప్రస్తుతం ఎన్నికల సమయంలో పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. నమ్మివచ్చిన విద్యార్థి నాయకులను నట్టేట ముంచిందన్నారు. బీజేపీ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర, నిరుద్యోగ మార్చి వంటి కార్యక్రమాలను విజయవంతం చేయడంలో తాము కీలకంగా పని చేశామన్నారు. బీజేపీలో నమ్మకంగా పని చేసిన కార్యకర్తలను గుర్తింపు లేదన్నారు. పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేసి, ప్రజల్లో తనకంటూ ఒక స్థానం కల్పించుకున్న తర్వాత, ఎన్నికల సమయం రాగానే పక్కనపెట్టేశారని మండిపడ్డారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను పట్టించుకోని ఏ పార్టీ బాగుపడలేదన్నారు. సరైన గుర్తింపు లేకపోవడంతో బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తనతో పాటు ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాలకు చెందిన 22మంది కీలక నాయకులు రాజీనామా చేశారని తెలిపారు.

**బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన జీవీఆర్, సిద్ధం వేణు**

బీజేపీకి రాజీనామా చేసిన ప్రజా గాయకుడు దరువు ఎల్లన్నను బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, రాజన్న సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు శనివారం ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సాదరంగా బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి, పెద్దలింగాపూర్ సర్పంచ్ గొడిసెల జితేందర్‌గౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.